ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న రోడ్డుపై గుంతలు
- ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ మృతి

దంతాలపల్లి: వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రయాణికుల పట్ల మృత్యు శకటాలుగా మారాయి. నిత్యం బస్సులు, లారీలు, ఇతర వాహనాలు తిరడం వల్ల రద్దీగా ఉండే రోడ్డుపై గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దంతాలపల్లి మండలంలో సుమారు 10కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్న రోడ్డుపై జరిగే ప్రమాదాలు ఎన్నో. నిత్యం జరిగే ఈ ప్రమాదల వల్ల కొంతమంది స్వల్ప గాయాలతో బయటపడుతుంటే, అవయవాలను కోల్పోయి అంగవైకల్యంతో మరికొందరు బాధపడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పెద్ద దిక్కును కోల్పోతు దిక్కులేని వాళ్లుగా మిగులుతున్నారు.

రెండు ఫీట్ల లోతుతో గుంతలు..

రోడ్డుపై ఏర్పడిన గుంతలు సుమారు ఫీటు నుంచి రెండు ఫీట్ల లోతుతో, రెండు నుంచి 5ఫీట్ల వెడల్పుతో ఏర్పడుతున్నాయి. నూతనంగా ఈ రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులకు తెలియక ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత సంవత్సరం మండల కేంద్రం శివారులో గుంతను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జు కావడంతో పాటు బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, తొర్రూరు మండలానికి చెందిన ఆటో డ్రైవర్ మృతి చెందారు. ఇటీవల శనివారం రాత్రి జరిగిన పెళ్లి బస్సు ప్రమాదంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ దేవేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రోడ్డుపై పదేపదే ప్రమాదాలు జరగడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు రోడ్డుకు ఎందుకు మరమ్మతులు చేయడం లేదని, ఇంక ఎంతమంది చనిపోతే రోడ్లకు మరమ్మతులు చేస్తారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే వెంటనే గుంతలు పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు.


శనివారం రాత్రి ప్రమాదానికి కారణమైన మండల కేంద్రంలోని గుంత


శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ దేవేందర్


ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఏర్పడిన గుంత


బొడ్లాడ, దంతాలపల్లి రాహదారిలో ఏర్పడిన గుంత

ప్రమాదాల నుంచి కాపాడాలి

జాతీయ రాహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి, ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలి. నిత్యం జరిగే ప్రమాదాలలో అనేక మంది గాయపడుతూ, మృతిచెందుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరిగిన అధికారులు మాత్రం స్పందించడం లేదు. వెంటనే రోడ్డుపై ఉన్న ప్రమాదకర గుంతలు పూడ్చి ప్రమాదాలను అరికట్టాలి

– సేను రాజేష్, దంతాలపల్లి

క్లుప్తంగా

గణనాథుడి ఎదుట సహస్ర దీపారాధన



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి అమీనాపురం గ్రామంలో శ్రీఅభయ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద సహస్ర దీపారాధన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా కుంకుమార్చన పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చేనుకు కాపలాగా 'పులి'



కురవి: వామ్మో పులి.. పులిబొమ్మను చూడగానే కోతులు పరారు అవుతున్నాయి.. కోతుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు అనేక ప్రయోగాలను చేస్తున్నారు. కురవి మండలం నారాయణపురం శివారు తండా వద్ద మొక్క జొన్న చేను పక్కన భూక్య కోటేష్ అనే కౌలు రైతు పులిబొమ్మను పెట్టి పంటను రక్షించుకుంటున్నాడు. సాక్షి తన కెమెరాలో ఈ దృశ్యాన్ని బంధించింది. పులిబొమ్మ దగ్గరకు రాగానే కోతులు పరుగులు పెడుతున్నాయని కోటేష్ చెప్పాడు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



డోర్నకల్: మండలంలోని బూరుగుపాడు సమీపంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం స్థానికంగా కలకలం రేపింది. బూరుగుపాడు, వెన్నారం రహదారిలో రోడ్డు పక్కన మఠం గుట్టపై గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. గుట్టపై రాళ్లను తొలగించి పెద్ద గొయ్యి తవ్వారు. ఆదివారం ఉదయం ఈ ప్రాంతంలో పొలాలకు వెళ్లిన రైతులు తవ్వకాలను గమనించి స్థానికులకు సమాచారం అందించారు. డోర్నకల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. 108 అంబులెన్స్ ఈఎంటీ మాచర్ల నరేష్, పైలట్ ప్రేమ్‌చంద్ తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలంలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన నలమాస వీరన్న, ఉదయ్ కుమార్ ద్విచక్రవాహనంపై తమ ఇంటికి వెళ్తున్నారు. కురవి మండల కేంద్రం వైపు నుంచి మహబూబాబాద్ పట్టణం వైపునకు ఓ కారు వస్తోంది. ఈక్రమంలో కలెక్టరేట్ సమీపంలోకి ద్విచక్రవాహనం చేరుకుంటుండగా కురవి నుంచి వస్తున్న కారు ఆ వాహనానికి ఎదురుగా వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసి వేగంగా వచ్చింది. అంతలోనే వీరన్న, ఉదయ్ కుమార్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్..

బస్సు డ్రైవర్ మృతి.. కేసు నమోదు

దంతాలపల్లి: ఓ ప్రవేట్ బస్సు డ్రైవర్ శనివారం రాత్రి మృతి చెందిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా ఎలకతుర్తి గ్రామానికి చెందిన బసమల్ల దేవరాజు(30) వృత్తి రీత్యా ప్రైవేట్ బస్సు డ్రైవర్. హన్మకొండకు చెందిన ఓ ముస్లిం కుటుంబంలో శనివారం ఖమ్మంలో జరుగుతున్న పెళ్లికి బస్సును తీసుకొని వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దంతాలపల్లి మండలకేంద్రం చేరుకున్నారు. ఈ క్రమంలో రోడ్డు పై ఉన్న ఓ గుంతను తప్పించే క్రమంలో బస్సు అదుపు తప్పి తూర్పాటి ఎలమంచి ఇల్లును ఢీకొటింది. ఇంటిపై రేకు దేవరాజు మెడకు కోసుకపోవడంతో అక్కడికక్కడే తన భర్త చనిపోయాడని మృతిడి భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేకరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

రైల్వే గేట్‌మెన్ అదృశ్యం



మహబూబాబాద్ రూరల్: రైల్వే గేట్‌మెన్ బోయిని రాంబాబు అదృశ్యమైన ఘటనలో అతడి భార్య ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర బజార్ ప్రాంతానికి చెందిన బోయిని రాంబాబు రైల్వే శాఖలో గేట్ మెన్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 24వ తేదీ ఆదివారం సాయంత్రం రాంబాబు డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు డ్యూటీ దగ్గర నుంచే అతడు భార్య ప్రియాంకకు ఫోన్ చేసి తనకు సీఐఎస్ఎఫ్‌లో క్లర్క్ ఉద్యోగం వచ్చిందని సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉందని చెప్పి విశాఖపట్నం వెళ్లాడు. ఆ రోజు నుంచి తన భర్త రాంబాబుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తుందని, ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదని, అతడి ఆచూకీ కోసం భార్య ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు.

చికిత్స కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యం



మహబూబాబాద్ రూరల్: చికిత్సకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటనలో అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. గార్ల మండలం చంద్రగిరి తండాకు చెందిన బానోత్ శోభన్ బాబు గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉంటున్నాడు. ఈనెల 29వ తేదీ శుక్రవారం తన ఇంటి దగ్గర గడ్డిమందు తాగడంతో చికిత్స నిమిత్తం అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో ఉన్న శోభన్ బాబు ఈనెల 30వ తేదీ శనివారం బాత్‌రూంకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం భార్య బానోత్ స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: వివాహం చేసుకుని మోసం చేసిన వ్యక్తిపై బాధిత వివాహిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణ పరిధిలోని భగత్ సింగ్ కాలనీ ప్రాంతానికి చెందిన ఒక వివాహితను ఆమె భర్త కాపురానికి తీసుకెళ్లకుండా చిత్రహింసలు పెడుతున్నాడు. ఆమె భర్తకు అత్తమామలు కూడా మద్దతు ఇస్తూ, ఉద్దేశపూర్వకంగా కేవలం కట్నకానుకల కోసమే ఆమెను పెళ్లి చేసుకుని కాపురానికి తీసుకెళ్లకుండా మోసం చేశాడు. దీంతో బాధితురాలు ఆమె భర్త, అత్తమామలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు.

ఐకమత్యంతో పోరాటాలకు సిద్ధం కావాలి


కురవి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి/దంతాలపల్లి/నర్సింహులపేట: గొల్లకురుమ యాదవుల జనాభా నిష్పత్తి ప్రకారంగా చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని టీపీసీసీ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయం ఎదుట సెప్టెంబర్ 5వ తేదీన గొల్లకురుమ యాదవ సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం గొల్ల కురుమ, యాదవులు ఐకమత్యంతో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరిగే సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకుడు చిన్నాల కట్టయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, పాక వెంకన్న యాదవ్, వీరేష్, సురేష్, పాక రంజిత్ పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రతీక భారతి సిమెంట్

తొర్రూరు: నిర్మాణ రంగంలో నాణ్యతకు, నమ్మకానికి ప్రతీక భారతి సిమెంట్ అని సంస్థ టెక్నికల్ మేనేజర్ కొత్త సునీల్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని సాయిరాం సిమెంట్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని, నిర్మాణ దృఢత్వం అధికంగా ఉంటుందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని తెలిపారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్ కాంక్రీట్ విషయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ రాజేశ్వర్‌రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ శివ, డీలర్ అశోక్‌రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


బహుమతి అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ఎరుకల సామాజిక వర్గాన్ని ఆదుకోవాలి


జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

తొర్రూరు: ఎరుకల సామాజిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు నడిగడ్డ శ్రీనివాస్ అన్నారు. ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో ఆదివాసీ స్వేచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సంఘ జెండాను ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే ఆదివాసీలకు ఆలస్యంగా వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ తీర్మానంతో ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తున్నామని, వెంటనే పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. రూ.500కోట్లు కార్పొరేషన్‌కు కేటాయించాలన్నారు. ఎరుకల హక్కుల కోసం రెండున్నర దశాబ్దాలుగా పాటుపడుతున్న వైహెచ్‌పీఎస్ సంఘ నాయకత్వానికి కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నడిగడ్డ సంపత్, నాయకులు సదానందం, సందీప్, మధు, సురేష్, యాకయ్య, సాయి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి


గూడూరు: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


కేసముద్రంలో..


నెల్లికుదురు మండల కేంద్రంలో..


డోర్నకల్‌లో..


మరిపెడలో..


పెద్దవంగరలో..

గూడూరు: ఒక దేశ ప్రధాని అని చూడకుండా కాంగ్రెస్ అగ్రనేత రాజకీయ అనుభవం లేకుండా, పీఎం నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండిస్తున్నామని, వెంటనే రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపన చెప్పాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెల్పూరు వెంకన్న, మేరెడ్డి సురేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను మండల బీజేపీ అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు నాయక్, మేరుగు మల్లయ్యగౌడ్, చెల్పూరు రాజు పాల్గొన్నారు.

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి జ్యోతిరావుపూలే సెంటర్‌లో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వరాచారి, జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామడుగు పాల్గొన్నారు.

డోర్నకల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి, రాహుల్‌గాంధీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, నాయకులు బొమ్మెరబోయిన సుధాకర్, కొయ్యడి ముఖేష్, చట్టు సుధాకర్, శ్యామ్, అన్వేష్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: బీజేవైఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు చందు రాజ్, ప్రభాకర్‌రెడ్డి, యాకిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కోజు గంగాధర్, భూక్య మంగమ్మ, పాల్వాయి భాస్కర్, లింగం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామంలో మూడు పావని 20రోజుల క్రితం పాఠశాలకు వెళ్తుండగా బైక్ ఢీకొని కాలు విరిగింది. ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.13,516ల ఆర్థికసాయాన్ని అందించారు.

రక్తదాన శిబిరం

మహబూబాబాద్ రూరల్: ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని బ్రహ్మకుమారి సుజాత అన్నారు. రాజయోగిని ప్రకాశమణి దాది పుణ్యస్మృతి దినోత్సవం, విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కేంద్రంలో ఆదివారం రక్తదానశిబిరం నిర్వహించారు.

పోస్టుకార్డు ఉద్యమం



బయ్యారం: తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన తమకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీకి పోస్టుకార్డుల ద్వారా తెలంగాణ ఉద్యమకారులు కోరారు. మండలంలోని బాలాజీపేటలో ఆదివారం 25మంది ఉద్యమకారులతో పోస్టుకార్డు ఉద్యమం జరిగింది. కార్యక్రమంలో వీరభద్రం, వీరన్న, వీరభద్రం, భీముడు, యాలాద్రి, ఎస్‌కె జానీ పాల్గొన్నారు.

మాలమహానాడు సెక్రెటరీగా నరేష్

డోర్నకల్: మాలమహానాడు మండల సెక్రెటరీగా అమ్మపాలెం గ్రామానికి చెందిన ఇట్టమల్ల నరేష్ నియమిస్తున్నట్లు మండల ఉపాధ్యక్షుడు పగిడిపల్లి వీర్రాజు ప్రకటించాడు.

స్థానికుడికే అవకాశం కల్పించండి

గార్ల: గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా స్థానికుడికే అవకాశం కల్పించాలని మాజీ వార్డు సభ్యుడు మొగిలి వెంకన్న స్థానిక ఓటర్లను కోరారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రీనివాస్ మృతి తీరనిలోటు

నెహ్రూసెంటర్: ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ మృతి తీరనిలోటని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ అన్నారు. శ్రీనివాస్ సంతాప సభ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, డీఈ విజయ్‌కుమార్, ఎస్‌ఏఓ శంకర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన గొల్ల, కురుమలకు ప్రత్యేక రుణాలు కేటాయించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అరిపిరాల గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కొమ్మనబోయిన యాకయ్య, తోట అశోక్, వల్లపు యుగేందర్, రాఘవులు పాల్గొన్నారు..

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



డోర్నకల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్రలో భాగంగా ఆదివారం గుర్రాలకుంట, ఉయ్యాలవాడ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసం శేఖర్, నాయకులు లాలూనాయక్, ఆంగోత్ వెంకన్న, తాళ్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

గార్ల: ప్రధాని నరేంద్రమోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ తీరును నిరసిస్తూ, హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి, మండల అధ్యక్షురాలు అజ్మీర సుమలత, జంపాల శ్రీను, పూనెం రాంబాబు ఉన్నారు.

అన్నదానాలు.. పూజలు

వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఐదో రోజు ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గణనాథుడికి పూజలు చేశారు. గణపతి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికి దక్కాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్: మూడు కోట్ల సెంటర్‌లో చిన్నారుల పూజలు


మరిపెడ రూరల్: వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు


డోర్నకల్: ఉయ్యాలవాడలో ..


బయ్యారం: రామాలయం వద్ద అన్నదానం..


కురవిలో..


మహబూబాబాద్ రూరల్: మండపం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు


నెహ్రూసెంటర్: అన్నదానం చేస్తున్న అజయ్‌సారథిరెడ్డి


గార్ల: జీవంజిపల్లిలో అన్నదానం..

స్వర్ణకార సంఘం కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నగూడూరు మండల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొండపర్తి ఏకబ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోజు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొండపర్తి రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎర్రోజు రాజు, సహాయ కార్యదర్శిగాజుజ్జూరి అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సంఘం జిల్లా అధ్యక్షుడు మోత్కూరి శంకర్, ప్రధానకార్యదర్శి ఎర్రోజు కృపాచారి, ఉపాధ్యక్షుడు విజయగిరి వెంకటరాజయా చారి హాజరయ్యారు. కమిటీ సభ్యులను సన్మానించారు.


ఎన్నికైన కమిటీ సభ్యులు

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

గార్ల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి గండితండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం గండితండాకు చెందిన బానోత్ సుమన్(32) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు సంతానం. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషాను వివరణ కోరగా ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.